
# కొయ్య బొమ్మలు

**ఆ** ఇంట్లో అందరికీ నచ్చని విషయం ఒక్కటే. అది తులశమ్మగారి ఘోషాణం. ప్రాణంలేని కొయ్య వస్తువుపట్ల ఆవిడ చూపే మక్కువ అందరికీ వింతగా కనిపిస్తుంటుంది. ఆవిడ కొడుక్కీ, కోడలికీ నచ్చక పోవటానికి కారణం ఒకటైతే, మనవరాలికి, మనవడికీ నచ్చక పోవటానికి కారణం మరొకటి.



ఇంట్లో ఒక గదినంతా భోషాణం ఆక్రమించేసుకోవటం పెద్దవాళ్లకు నచ్చలేదు. ఇంటికి వస్తూపోతున్నవాళ్లు ఆ భోషాణం గురించే తలో మాట అంటున్నారు.

"ఇల్లంతా బొమ్మరిల్లులా చక్కగా తీర్చిదిద్దుకున్నారు. ఆ గదిలో దిష్టిబొమ్మలా భోషాణం పెట్టేమిటండీ బాబు. పాతకాలంలో అయితే ఎలుకలబాధనో, పిల్లులబాధనో తప్పించుకోవటానికి పల్లెటూళ్లలో వాడుకునేవారు. దాని అవసరం ఇప్పుడెవరికుంది?" అంటూ అబ్బుర పడేవారు.

ఆ మాటలకు తులశమ్మ కొడుకూ, కోడలు బిక్కచచ్చిపొయ్యేవాళ్లు.

ఇకపోతే పిల్లలకు నాయనమ్మతో అన్ని విషయాల్లోనూ సఖ్యత బాగానే వుంది. కాని ఆ భోషాణం గదిలోకి దాగుడుమూతలాడుకోవటానికో, బొమ్మలపెళ్లిళ్లు చేసుకోవటానికో వెళ్తే మాత్రం వెంటబడుతుంది. బొమ్మల పెళ్లికి సంగీతంలా దరువు వేసుకోవటానికి వాళ్లకు భలే వుంటుందది. దాగుడు మూతలప్పుడు దాక్కోవటానికి బాగా ఉపయోగపడ్తుంది. అయితే వాళ్ల ముచ్చట ఏ రకంగాను తీర్చుకోనివ్వదు.

"మా నాన్నకదూ, మా బుజ్జికదూ! పాడవుతుంది. బయట ఆడుకోండ్రా" అంటూ బ్రతిమాలుతుంది.

ఒకవేళ పెంకిగా ఆవిడ మాటల్ని పెడచెవిన పెడ్తే దండనగా చెవులు మెలితిప్పి భయపెడుతుంది.

ఆ ఇంట్లో భోషాణం వలన చిన్నా, చితగా గొడవలు అప్పుడప్పుడు జరుగుతూనే వుంటాయి.

ఒక్కోసారి పిల్లలు తమను నిరోధించిందన్న అక్కసుతో ఏడుస్తూ నాయనమ్మ మీద తల్లికో, తండ్రికో ఫిర్యాదులు చేస్తుంటారు.

"మీది మరీ చాదస్తం. అదేదో అపురూపమైందన్నట్లు ప్రాణం పెడ్తారు. అదేమన్నా కరిగేదా, విరిగేదా?" అంటుంది కోడలు సీత నిరసనగా.

"అమ్మా! కరవమంటే కప్పకుకోపం, విడవమంటే పాముకి కోపం. ఏమిటమ్మా ఈ గోల, మీ ఇద్దరి మధ్య నేను చస్తున్నాను" అంటూ కొడుకు రమణయ్య విసుక్కుంటాడు.

వాళ్లలా విసుక్కుంటున్నప్పుడల్లా ఆవిడ మనస్సు బాధతో కృంగిపోతుంటుంది. పిల్లలంటే తనకు ప్రాణంకదూ! ఎంతో కాలంగా వుంటున్న వస్తువు కాస్తా పాడయి పోతుందన్న భయంతో పిల్లల్ని అదిలించటం కూడా తప్పేనా! బ్రతిమాలో, బామాలో తను పిల్లల్ని సముదాయిస్తుందికదూ! ఇంతలోకే అంతంత మాటలనాలా!

ఒక రోజు మనవడు ఏదో ఆకతాయి పని చెయ్యబోయినట్లున్నాడు. తలుపు సందున వేలు నలిగింది. వాచిపోయింది. ఆ నొప్పికి రోజంతా ఏడుస్తూనే వున్నాడు. చీము పట్టకుండా మందులు కూడా మింగించాల్సొచ్చింది.

కొడుకూ, కోడలు ఆ రోజంతా కారాలు మిరియాలు నూరుతూనే వున్నారు.

"ఇదొక శనిలా దాపురించింది. అక్కడి నుండి తీసి పారేయించమంటే ఒకరూ నా మాట పట్టించుకోరూ" అంటూ సీత మండిపడింది.

మనవడు పడుతున్న బాధకు తులశమ్మ మనస్సు విలవిలలాడింది. పిల్లలు దాని జోలికెళ్లకుండా ఓ కంట కనిపెడుతూనే వుంటుంది. ఏదో పనిలో తలమునకలుగా వుండటం కనిపెడ్తే చాలు పిల్లల్లా ఆ గదిలోకి చొరబడతారు. ఆవిడ మాత్రం ఎంతని కాపలా కాయగలుగుతుంది?

ఉపశమనానికి ఆ రోజంతా మనవడి వేలికి కాపు పెడుతూ సపర్యలు చేసింది.

"దాని జోలి నీకెందుకు నాన్నా! అటు వెళ్లొద్దని నీకూ, అక్కకూ ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోరేమిట్రా!" అంటూ అనునయించబోయింది.

ఆ మాటలు రమణయ్య చెవిన బడటంతో ఇంతెత్తున లేచాడు. "ఇంత వయసొచ్చి మా మాట నువ్వు చెవినేసుకున్నావు గనుకనా! అవతల పారేయిస్తానంటే అదేదో మీ తాత ఇచ్చిన ముల్లెలా లబలబలాడతావు. పెద్దలకు లేని జ్ఞానం పిల్లల కొస్తుందా?" అంటూ నిష్ఠూరం ఆడాడు.

ఆ మాటలకు తులశమ్మ గుడ్లలో నీరు కుక్కుకున్నది. తనకు సమర్థింపుగా ఒక్కమాట కూడా అనలేకపోయింది.

నెలలో రెండు మూడుసార్లన్నా ఈ రకమైన గొడవలు వస్తూనే వున్నాయి. సాకు దొరికినప్పుడల్లా కొడుకూ, కోడలితో నిందలు పడక తప్పటంలేదు. ఇంత జరుగుతున్నా భోషాణంపట్ల తన మమకారం చంపుకోలేక పోతూనే వుంది.

ఆ భోషాణాన్ని కేవలం కొయ్య వస్తువుగా ఆమె ఎన్నడూ అనుకోలేదు. తన శరీరంలో అదీ ఒక భాగమనే అనుకుంటుంది. పుట్టింటి జ్ఞాపకాలను, మెట్టినింటి అనుభూతులను అందులో పదిలంగా భద్రపరుచుకున్నదామె. సుమారు యాభై యేళ్లకు పైబడిన జీవితాన్ని దానితో ముడి పెట్టుకున్నదామె.

తులశమ్మను కాపురానికి పంపేటప్పుడు పుట్టింటివాళ్లు ఇచ్చిన కానుక అది. మేలు జాతి టేకుతో వడ్రంగి ఎంతో నైపుణ్యంతో చేశాడు. భోషాణం కాళ్లకు, కిందా, పైనా ఇత్తడి గుబ్బలు, చుట్టూ బద్దీలతో నగిషీలు పెట్టించారు. అవి అందంగా తళతళ లాడుతుంటాయి.

కాపురానికొచ్చిన కొత్త కోడలితోపాటు పంపిన ఆ కానుకను చూసిన అమ్మలక్కలు దాని పనితనానికి, "ఎంత చక్కటిదమ్మా?" అంటూ మెచ్చుకున్నారు.

తులశమ్మ ఆ భోషాణం మీద కనీసం ఈగనైనా వాలనిచ్చేది కాదు. మాసి పోతుందన్నట్లుగా ఎవర్నీ తాకనిచ్చేదికాదు. శుభ్రంగా వుండేందుకు రోజూ కాసేపు కాలం వెచ్చించేది. ఆవిడ చూపే శ్రద్ధ వలన ఇప్పటికీ అది కొత్తదానిలా మెరిసిపోతూనే వుంటుంది.

పాలు, పెరుగు, నెయ్యి రకరకాల వంటకాలు అందులో భద్రంగా దాచి వుంచేది. మూత తీస్తే చాలు, ఇల్లంతా కమ్మటి వాసనలతో గుభాళించేది. దానిపట్ల భార్య చూపుతున్న శ్రద్ధాసక్తులకు వీరరాఘవయ్య కూడా ఆటలు పట్టిస్తుండేవాడు.

"నీతోపాటు కాపురానికి పుట్టింటి తోడు మంచిదే ఎన్నికచేసి పంపాడు మీ నాన్న" అంటూ పగలబడి నవ్వేవాడు.

"ఊరుకుందురూ! గాదెల్లో పంట, భోషాణంలో వంట నిండుగా వున్నప్పుడే గదండీ ఇంట్లో సుఖశాంతులు తాండవ మాడేది" అంటూ ముచ్చట పడుతుండేది.

వీరరాఘవయ్య కాలం చేసి పదేళ్లయింది. పిత్రార్జితంగా భర్తకు ఇల్లు, కొంత పొలం వచ్చాయి. ఆయన కాలం చెయ్యకముందే పిల్లల చదువు బాధ్యతలు తీరిపోయాయి. ఒక్కగానొక్క కొడుకు రమణయ్య ఉద్యోగస్తుడయ్యాడు. ఉద్యోగరీత్యా పట్నంలోనే స్థిరపడాల్సి వచ్చింది. కూతురి పెళ్లి చేసి కాపురానికి పంపారు. భర్తపోయిన తర్వాత తులశమ్మ ఐదేళ్లు ఒంటరిగా పల్లెటూరిలోనే వుండిపోయింది.

అటు కొడుకునో, ఇటు కూతురినో లేదా వాళ్ల పిల్లల్నో చూడాలన్న కోరిక కలిగినప్పుడు వెళ్లి వారం పది రోజులు వుండి వస్తుండేది. వీలు చిక్కినప్పుడు వాళ్లూ వస్తూ పోతుంటారు. తన నెరిగిన మనుషుల మధ్య, మెట్టినింట్లోనే తన జీవితం ఎల్లమారి పోవాలని ఆవిడ కోరుకున్నది.

"ఒక్కదానివి ఇక్కడేం వుంటావమ్మా! వచ్చి మాతోనే వుండిపోవచ్చుగదా!" అంటూ రమణయ్య తరచూ పోరుపెడుతుండేవాడు.

"కాలు చెయ్యి కదులుతున్నంతవరకు నాకేం లోటురా! మీ నాన్నగారు కడతేరిన చోటనే నన్నూ కడతేర నివ్వండి" అంటూ కొడుకు ప్రతిపాదన త్రోసి పుచ్చుతుండేది.

అయితే తను కోరుకున్నట్లుగా ఆ పల్లెలోనే కాలం వెళ్లబుచ్చుకునే అదృష్టాన్ని ఆవిడ దక్కించుకోలేక పోయింది. పరిస్థితుల ప్రభావానికి తల వంచక తప్పలేదు.

రమణయ్యకు ఉద్యోగంలో ప్రమోషనొచ్చింది. స్థలం కొనుక్కుని లోను మీద ఇల్లు కట్టుకోవాలని అనుకున్నాడు. లోను డబ్బులకు తోడు చేతి డబ్బు కొంత పెట్టగలిగితే మంచి ఇల్లు కట్టుకోవచ్చనుకున్నాడు. స్వగ్రామంలో వున్న ఇల్లు, పొలం అమ్మటమే సరైన దారిగా తోచిందతనికి.

"అమ్మా! నీకు వయస్సు పైబడుతున్నది. ఇక్కడ మాత్రం ఎవరున్నారు? ఈ ఊళ్లో వచ్చి వుండే అవసరం నాకు కలగదు. నాకంటూ ఒక ఇల్లు అక్కడే ఏర్పాటు చేసుకోవాలను కుంటున్నాను. నువ్వూ మాతోపాటే వుందువుగాని. బాగా ఆలోచించు" అంటూ ప్రాధేయపడసాగేడు.

తులశమ్మ బాగా ఆలోచించింది. తను కాదంటే కొడుకు కష్ట పెట్టుకుంటాడు. తన ఊరిపట్ల అతనికి ఎలాంటి మమకారాలూ లేవు. పొలం, పుట్రా తెగనమ్ముకుని ఊరొదిలి పోవటం తనకు ఇచ్ఛగించక పోవచ్చు. కాదు, కూడదని వాడినెందుకు నష్టపెట్టడం అనుకున్నది. చిన్న పిల్లలపట్ల పెంచుకున్న మమకారం కూడా ఆమెను రాజీపడేలా చేసింది.

చివరికి పగ్గాలు కొడుకు చేతికే అందించింది. ఇల్లు, పొలం అమ్మారు. డబ్బు చేతికొచ్చింది. ఇంట్లో సామానంటూ ఆవిడ పెద్దగా వుంచుకున్నది లేదు. అటు కూతురికో, ఇటు కొడుక్కో అవసరాన్ని బట్టి పంపిస్తూ వచ్చింది. ఇక చివరకు మిగిలిందల్లా భోషాణం.

"అమ్మా! ఇక్కడంటే పెద్ద ఇల్లు గనుక ఏదో మూల పడుంది. అక్కడ ఒక గదంతా ఇదే ఆక్రమిస్తుంది. అంతదూరం తీసుకెళ్లడమూ శ్రమతో కూడిన పని. ఎవరొకరు తీసుకుంటారు, అమ్మివేద్దాం" అన్నాడు రమణయ్య.

ఈ ఒక్క విషయంలో మాత్రం తులశమ్మ సమాధాన పడలేకపోయింది. పుట్టింటి కానుక పట్ల ఆవిడ పెంచుకున్న మమకారం తెంచుకోలేనిది.

"బాబూ! నాదంటూ మిగిలింది ఇదొక్కటే! నేనున్నంత కాలం నాతోపాటు పడుంటుంది. ఈ కోరిక మాత్రం కాదనకు" అన్నదామె.

రమణయ్య కాదనలేకపోయాడు. ఎడ్లబండి మీద పట్నం తరలించక తప్పలేదు.

రమణయ్య స్థలం కొని లోను మంజూరు చేయించుకుని ఇల్లు కట్టుకున్నాడు. కొత్త ఇంట్లో ఆ భోషాణం కోసం ప్రత్యేకంగా ఒక గది కేటాయించాల్సి వచ్చింది. తులశమ్మ కూడా తన సామాను ఆ గదిలోనే సర్దుకున్నది. పైకి ఎలా ఉన్నా కొడుకు, కోడలికి దానిపట్ల అసంతృప్తి రోజురోజుకు పెరుగుతూనే వుంది. దానికి తోడు పిల్లలు రకరకాలుగా చిరాకులు తెచ్చి పెడుతున్నారు.

* * *

పది రోజులపాటు తల్లిని పంపమంటూ అన్నకు ఉత్తరం రాసింది లక్ష్మి. కూతుర్ని, పిల్లల్ని చూడాలని కొద్ది కాలంగా ఆవిడ ఉబలాట పడుతూనే వున్నది. ఉత్తరం రావటంతో మనస్సును నిబ్బరించుకోలేకపోయింది.

రమణయ్య ఆవిడ ప్రయాణానికి ఏర్పాట్లు చేశాడు.

కూతురి దగ్గరకి వెళ్తే రావటానికి ఎట్లా లేదన్నా రెండు మూడు వారాలు పడుతుంది. ఒక పట్టాన కదలనివ్వదు. కూతురు వుండేది ఒక పల్లెటూరు. పట్నవాసపు జీవితంతో విసుగెత్తిపోతున్న ఆవిడకు కూతురి దగ్గరకు వెళ్లే అవకాశం అనేది ఒక ఆటవిడుపులాంటిది.

పట్నంలో పుట్టలుగా మనుషులు, గుట్టలు గుట్టలుగా ఇళ్లూ అయితే వుంటాయిగాని నోరారా పిలిచే వారుగాని, పిలిస్తే పలికేవారుగాని, మనసారా ముచ్చట్లాడేవారుగాని

ఆవిడకు కనిపించరు. సమయాన్ని బట్టి గోడ గడియారంలో గంటలు మోగుతున్నట్లుగా, పొడిచే పొద్దుకు వాలే పొద్దుకు మధ్య జీవితం అవిశ్రాంతంగా గిరికీలు కొడుతూ వుంటుందనేది తులశమ్మ గ్రహించిన సత్యం. పల్లెపట్టును వదిలి వచ్చినప్పట్నుండి జీవితం వెలితితో వెలవెలబోతున్నట్లే వుందామెకు.

"అమ్మలూ! భోషాణం జోలికి వెళ్లకండి! మీకు వస్తూ బోలెడు తాయిలాలు తెస్తా" అంటూ ఆశపెట్టి, పిల్లల్ని బుజ్జగించి మరీ వెళ్లింది.

రేపు మాపంటూ కూతురు నెలరోజులు తల్లిని కదలనివ్వలేదు.

"అమ్మా! ఎప్పట్నుండో నిన్ను అడగాలనుకుంటున్నాను. ఏమనుకోనంటే అడుగుతాను" అన్నది లక్ష్మి.

"అదేం మాటే! నేను నీ తల్లినికదూ! అనుకొనేదేముంది. అడుగు" అన్నదామె ఆప్యాయంగా.

"భోషాణం చేయించుకోవాలనుంది. డబ్బు ఖర్చని కాదుగని ఈ రోజుల్లో ఆ పనితనం మాత్రం ఎక్కడుంది? మనది చాలా బాగుంటుంది. నీకంతగా అవసరం లేదనుకుంటే నాకివ్వవూ?" అడిగింది లక్ష్మి.

కొడుకు, కోడలు దాన్ని పనికిమాలిన వస్తువుగా భావిస్తుండటం ఎంతటి బాధకుగురి చేసిందో, కూతురు దానిపట్ల చూపుతున్న మక్కువ తులశమ్మను అంతగా సంతోష పెట్టింది. కూతురి అవసరాన్ని గ్రహించి తనకు తోచింది ఇస్తూ వచ్చిందే కాని ఇన్నేళ్లలో ఫలానిది కావాలని నోరు విప్పి అడగని బుద్ధిమంతురాలు. కూతురి కోరిక ఆవిడ మనుస్సును తరచూ పట్టి పీడిస్తున్న బాధ నుండి విముక్తి కలిగించినట్లయింది.

"ఒక వేళ అన్నయ్య వుంచుకుంటానంటే వద్దులే. నేను వేరే చేయించుకుంటాను" అన్నది మెల్లగా.

"అబ్బే లేదమ్మా! దాన్నెలాగోలా వదిలించుకోవాలని చూస్తున్నారు వాళ్లు. బొత్తిగా దాని విలువ తెలీదు. నా ప్రాణం పోయిన మరుక్షణం దాన్ని దుంపనాశనం చేస్తారనే దిగులు పడుతున్నా. నేనున్నంత కాలం నా కళ్ల ముందు అది వుండాల్సిందే. నేను పోయాక నీకు పంపించమని అన్నయ్యతో చెప్తాను" అన్నది ఒక నిశ్చయానికొస్తూ.

తల్లి మాటలకు లక్ష్మి ముఖం సంతోషంతో వెలిగింది.

బయల్దేరేముందు, పిల్లల కోసమని తల్లీ కూతుళ్లు రెండు రోజులు ఊపిరి సలపకుండా రకరకాల పిండివంటలు చేశారు.

కొడుక్కి ఉత్తరం రాయించి బయల్దేరింది. రమణయ్య బస్టాండుకి వచ్చాడు. ఇంట్లో అడుగుపెట్టారో లేదో పిల్లలు గోలగా అరుస్తూ తులశమ్మను చుట్టుముట్టారు.

"నాన్నమ్మా! తాయిలం పెట్టవా?" అంటూ ఊపిరి సలపనివ్వలేదు.

తులశమ్మ హాల్లోనే తిష్టవేసి, రకానికి కొద్దిగా పిల్లలు తినటానికి ప్లేటులో పోసి ఇచ్చింది. తలలెగరేసుకుంటూ తింటున్నారిద్దరూ. వంటకాలు డబ్బాల్లో పోసి దాచిపెట్టటానికని లేచి గదిలోకి వెళ్లింది. భోషాణం అక్కడలేదు. ఆమె కళ్లకు గది బోసిగా ఎలా తెలాపోతున్నది. కాళ్లల్లో వణుకు పుట్టుకొచ్చింది.

హాల్లోకివస్తూనే, "అమ్మాయ్! భోషాణం గదిలో లేదు. ఎక్కడ పెట్టించావమ్మా?" అన్నది ఆందోళనగా.

సీత ముసిముసిగా నవ్వింది. "కంగారుపడకండి. ఇలా రండి!" అంటూ తులశమ్మను బెడ్‌రూంలోకి తీసుకెళ్లింది. కొత్తగా మెరిసిపోతున్న డ్రస్సింగ్ టేబుల్ ముందు నిలబెట్టింది. కోడలి ప్రవర్తన తులశమ్మకు ఏమీ అంతుబట్టటం లేదు.

"చూడండి! మీ భోషాణం వడ్రంగి చేతిలో ఎంత నాజూగ్గా ముస్తాబయిందో! పిల్లలా నా మాట వినరు. మీరా పోనీ లెమ్మని ఊరుకోరు. లేనిపోని గోల ఇంట్లో. ఇక మీరు ప్రశాంతంగా వుండొచ్చు" అన్నది సీత నవ్వుతూ.

ఆ మాటలకు తులశమ్మ కొయ్యబారిపోయింది.

రమణయ్య మెల్లగా అక్కడి కొచ్చాడు.

"మీ కోడలు ఎప్పట్నుండో డ్రస్సింగ్ టేబుల్ చేయించమని గోల చేస్తున్నది. టేకు కొని చేయించాలంటే చాల అవుతుంది. భోషాణం ఇంట్లో అడ్డం తప్పితే ఎందుకు ఉపయోగపడ్తుంది గనుక! నేనే పురమాయించాను. చవగ్గా అయిపోయింది" చెప్పాడు నింపాదిగా.

తులశమ్మ కళ్ల నుండి నీరు పొంగుకొస్తున్నది.

అంతలో పిల్లలిద్దరూ పరిగెత్తుకు వచ్చి తులశమ్మ చేతుల్ని చెరోటి దొరక పుచ్చుకున్నారు.

"నాన్నమ్మా! ఇటురా! నీ కోసం అమ్మా, నాన్న భలే గిఫ్ట్ చేయించారు" అంటూ ఇద్దరూ ఆవిడను పట్టి డ్రాయింగ్ రూంలోకి లాక్కెళ్లారు. ప్రాణంలేని బొమ్మలా పిల్లల వెంట నడిచిందామె.

ఒక మూలగా పెట్టి వున్న పడక కుర్చీలో ఆమెను బలవంతంగా లాగి కూర్చోబెట్టి, "బాగుందికదా! భలే! భలే!" అంటూ చప్పట్లు చరుస్తున్నారు పిల్లలు.

"చెక్క మిగిలితే మీకు బాగుంటుందని ఈజీ ఛైర్ కూడా చేయించాం" కోడలు చెప్తున్నది ఘనంగా.

తులశమ్మ నిస్తేజంగా పడక కుర్చీలో వాలిపోయింది. ఆమె గుండె ముక్కలు ముక్కలుగా పగులుతున్న శబ్దం మాత్రం ఎవరికీ వినబడటం లేదు.

*(స్వాతి మాసపత్రిక, నవంబరు 1991)*